ప్రజలు సంతోషంగా హోలీ పండుగ జరుపుకోవాలి : కలెక్టర్

కొత్తగూడెం టౌన్/ కొత్తగూడెం సింగరేణి, మార్చి 24 : జిల్లా ప్రజలు ఆనందంగా హోలీ పండుగను జరుపుకోవాలని ప్రజలకు కలెక్టర్ ప్రియాంక ఆల శుభాకాంక్షలు తెలిపారు. రంగుల హోలీ ప్రతీ ఇల్లు ఆనందమయం కావాలని అన్నారు. హోలీ ఆడిన తర్వాత కాలువలు, చెరువులు, నదులు, వాగులు, వంకలకు ఈతకు వెళ్లవద్దని, సరదా మాటున ప్రమాదం పొంచి ఉందని, తల్లిదండ్రులు పిల్లలను ఈతకు వెళ్లకుండా నియంత్రణ చేయాలని కలెక్టర్ సూచించారు. రంగుల పండుగ హోలీని సింగరేణి ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకోవాలని సింగరేణి సీఎండీ బలరాం నాయక్ ఆదివారం ప్రకటనలో పేర్కొనారు. సింగరేణి ఉద్యోగులందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష వితరణ



రూ.లక్ష వితరణ అందజేసిన దాతకు రశీదును అందజేస్తున్న ఈవో రమాదేవి

భద్రాచలం, మార్చి 24 : భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నదాన పథకానికి విజయవాడ పెనమలూరు వాస్తవ్యులు రాళ్లబండి వెంకట రామకృష్ణ శాస్త్రి, బాల త్రిపుర సుందరి దంపతులు రూ.1లక్ష అందజేశారు. ఆదివారం ఉదయం రామాలయానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన వారు ముందుగా స్వామివారిని దర్శించుకొని అంతరాలయంలో ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉపాలయాలను సందర్శించి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. తరువాత ప్రతి రోజు అన్నదానం తమ పేరుమీద నిర్వహించాల్సిందిగా కోరుతూ దేవస్థానం ఈవో రమాదేవికి రూ.1లక్ష అందజేసి, రశీదును స్వీకరించారు. ఆలయ అధికారులు దాతను శాలువాతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

అమ్మవారికి కంఠాభరణం బహూకరణ

భద్రాచలం, మార్చి 24 : పట్టణానికి చెందిన విశ్రాంత బ్యాంకు ఉద్యోగి డీవీ శంకరరావు, రూపశ్రీ దంపతులు సీతారామచంద్ర స్వామివారికి రూ.2.25లక్షల (39.710 గ్రాముల) విలువైన బంగారు కంఠాభరణాన్ని ఆదివారం వితరణగా అందజేశారు. ఆలయ అధికారులు స్వామివారి నిత్యకల్యాణంలో అమ్మవారికి అలంకరించారు. సోమవారం స్వర్ణలక్ష్మి అమ్మవారి పుట్టిన రోజును పురస్కరించుకొని లక్ష్మితాయారు అమ్మవారికి అలంకరించనున్నారు.

మోక్ష వేంకటేశ్వరస్వామి కల్యాణం

అన్నదానంలో పాల్గొన్న రామభక్తులు

పాల్వంచ, మార్చి 24: మున్సిపాలిటీ పరిధిలోని గుడిపాడు మోక్ష వెంకటేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో ఆదివారం అర్చకులు ఘనంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆరెం ప్రశాంత్, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పెద్దమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పాల్వంచ రూరల్, మార్చి 24: జగన్నాథపురం– కేశ్వాపురం మధ్య ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయానికి ఆదివారం భక్తులకు పోటెత్తారు. అమ్మవారి జన్మస్థలం వద్ద మొక్కులు తీర్చుకున్నారు. మూల విరాట్ వద్ద పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు పాల్వంచకు చెందిన దాత బొబ్బల శ్రీనివాసరావు రూ.15 లక్షలతో నిర్మించనున్న గోవుల షెడ్ పనులకు భూమిపూజ చేశారు. సోమవారం ఆలయ సన్నిధిలో చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఈవో సుదర్శన్ తెలిపారు.

నేడు సంతాన వేణుగోపాలస్వామి తిరుకల్యాణం

సారపాక, మార్చి 24 : మండల పరిధిలోని ఇరవెండిలో గోదావరి నదీతీరన కొలువైన సంతాన వేణుగోపాలస్వామి తిరుకల్యాణం సోమవారం కనులపండువగా జరుగనుంది. వేదపండితులు, అర్చకుల మంత్రోచ్చరణలు, మేళతాళాలు, భాజాభజంత్రీల నడుమ అభిజిత్ లగ్నంలో మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య తెలిపారు. కల్యాణాన్ని తిలకించేందుకు ఎన్నారైల కుమారులు జయశేఖర్, నీలిమ దంపతులు, తాళ్లూరి రాజా శ్రీకృష్ణ, గాయత్రీ దంపతులు, కుమార్తె అనితారాణి, గొట్టిపాటి ప్రవీణ్‌కుమార్ దంపతులు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకానున్నట్లు తెలిపారు. కల్యాణం సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కల్యాణానికి ముందు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నారు. కల్యాణోత్సవం సందర్భంగా సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

'డిప్యుటేషన్లు, నియామకాలపై కథనాలు నిజం కాదు'

కొత్తగూడెం టౌన్, మార్చి 24: కలెక్టర్ ఆధీనంలోనే వైద్యారోగ్యశాఖలో డిప్యుటేషన్లు, నియామకాలు జరుగుతున్నాయని, ఒక్కో పోస్టుకు రూ.లక్షల్లో చేతులు మారాయని కొన్ని మీడియా సంస్థల నుంచి వచ్చి వార్తల్లో నిజం లేదని ఆదివారం డీఎంహెచ్‌వో శిరీష ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నియామకాలు, డిప్యుటేషన్లు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరుగుతున్నాయన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

క్రీస్తు బాటలో పయనిద్దాం..

ఘనంగా మట్టల ఆదివారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

చండ్రుగొండ, మార్చి 24 : ప్రపంచ శాంతికోసం క్రీస్తు చూపిన బాటలో మనమంతా పయనిద్దామని గానుగపాడు చర్చి ఎవలాంజలిస్టు జాన్సన్ అన్నారు. ఆదివారం గానుగపాడులో సీఎస్ఐ పాస్టర్ చైర్మన్ ఎం రెవరెండం దేవదానం అధ్యక్షతన క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగను జరుపుకున్నారు. చర్చీలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఈత మట్టలతో గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మతపెద్దలు మాట్లాడుతూ.. అన్ని మతాల సారంశం ఒక్కటేనని, పేదలకు సేవ చేయడంలోనే నిజమైన దైవత్వం దాగి ఉందన్నారు. ఇతరుల పట్ల స్నేహభావం కలిగి ఉండాలన్నారు. క్రైస్తవులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాల్వంచలో...

పాల్వంచ, మార్చి 24 : పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ఆరోగ్యమాత దేవాలయంలో మట్టల ఆదివారం వేడుకలు నిర్వహించారు. ఈత మట్టలతో క్రైస్తవులు ర్యాలీ చేశారు. అల్లూరి సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్, బస్టాండ్ మీదుగా జాతీయ రహదారి పక్కన ఉన్న ఆరోగ్యమాత దేవాలయం వరకు ర్యాలీ జరిగింది. పట్టణంలోని పలు చర్చీల్లో మట్టల ఆదివారం వేడుకలు జరిగాయి. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కొత్తగూడెం చర్చిలో..

పాల్వంచలో మట్టలతో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

రామవరంలో...

రామవరం, మార్చి 24 : రుద్రంపూర్‌లో ఈత మట్టలు చేతపట్టి హోసన్న గీతం పాడుతూ పట్టణ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. ఉపవాస దీక్షలు ఆఖరి వారానికి చేరుకోవడంతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేట టౌన్, మార్చి 24 : పట్టణంలోని గుడ్‌న్యూస్ స్కూల్ ప్రాంగణంలోని మట్టల ఆదివారం వేడుకలను చర్చి ఫాస్టర్ జోషి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా క్రైస్తవులు ప్రదర్శన నిర్వహించారు.

అశ్వారావుపేటలో..

చండ్రుగొండ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

కొత్తగూడెంలో..

కొత్తగూడెం టౌన్, మార్చి 24 : జిల్లాలో ఆదివారం క్రైస్తవులు మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. శనివారం రాత్రి నుంచే క్రీస్తు పునరాగమన వేడుకల్లో పాల్గొనేందుకు క్రైస్తవులు భారీ సంఖ్యలో చర్చిలకు వెళ్లారు. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని సీఎస్ఐ సెయింట్ ఆండ్రూస్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వందల సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

ఇల్లెందులో...

ఇల్లెందు రూరల్, మార్చి 24 : క్రీస్తు పట్ల విశ్వాసం గొప్పదని సీఎస్ఐ చర్చీ చైర్మన్ రెవ. ప్రాంక్లీన్ అన్నారు. ఆదివారం మండలంలోని మామిడిగూడెం, పట్టణంలోని కోర్టు ఎదుట గల చర్చీలో మట్టల పండుగను ఘనంగా నిర్వహించారు. పురవీధుల్లో తాటిమట్టలను పట్టుకుని యేసుక్రీస్తు సందేశంపై ప్రజలను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శాంతి సమాధానం సందర్భంగా ఈత, ఖర్జూర మట్టల ఊరేగింపు పాదయాత్ర జరుపుతారన్నారు.

ఇల్లెందులో..

రామవరంలో..

నీటి గుంతలో పడి బాలుడి మృతి

పాల్వంచ రూరల్, మార్చి 24 : చెక్‌డ్యాంలో ఈత కొట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు ఓ బాలుడు మృతి చెందిన ఘటన పాతసూరారంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జక్కుల సంపత్‌కుమార్ (16) పదోతరగతి పరీక్షలు రాస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి గ్రామంలోని చెక్‌డ్యాం వద్దకు వెళ్లాడు. అనంతరం ఈత కొట్టేందుకు వాగులోకి దిగి గల్లంతయ్యాడు. అప్రమత్తమైన తోటిస్నేహితులు గల్లంతైన బాలుడి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తుల సాయంతో సంపత్‌కుమార్‌ను వాగు నుంచి బయటకు తీయించి సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు సంపత్‌కుమార్‌ను పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు.

కానిస్టేబుల్‌పై దురుసు ప్రవర్తన

అశ్వారావుపేట, మార్చి 24 : న్యూసెన్స్ చేయడంతోపాటు కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించిన పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ సమీపంలోని పేరాయిగూడెంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం మెటీరియల్ దిగుమతి చేశారు. రోడ్డుకు అడ్డంగా పోశారంటూ గ్రామానికి చెందిన రాజేశ్, వెంకటేశ్వర్లు, రాంబాబు, ప్రసాద్ దుర్భాషలాడుతూ న్యూసెన్స్ చేస్తున్నారు. దీంతో గ్రామస్తులు కొందరు 100కు డయల్ చేశారు. స్థానిక బ్లూకోట్ కానిస్టేబుల్ సంతోశ్ అక్కడకు వెళ్లాడు. ఆయన పట్ల కూడా దురుసుగా ప్రవర్తించారు. కానిస్టేబుల్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరరావు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై శ్రీరాముల శ్రీను చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

అశ్వారావుపేట, మార్చి 24 : గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకున్నది. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం రత్నగిరి గ్రామానికి చెందిన బలుసుపాటి అంజిమూర్తి (37) ద్విచక్ర వాహనంపై ఆదివారం అశ్వారావుపేటలోని బంధువుల ఇంటికి వస్తున్నాడు. నారంవారిగూడెం సమీపంలో రామచంద్రాపురం క్రాస్ రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అంజిబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య రజనీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రహమాన్ తెలిపారు.

రాధాకృష్ణుల కల్యాణము చూతము రారండి

జాతరకు సిద్ధమైన నాయకులగూడెం ఆలయం

ఇల్లెందు రూరల్, మార్చి 24: రొంపేడు పంచాయతీ పరిధిలోని నాయకులగూడెంలోని శ్రీరాధాకృష్ణుల ఆలయ పరిధిలో ఏటా హోలీ రోజున జాతర ప్రారంభమవుతుంది. ఇదే రోజు కల్యాణ మహోత్సవం ఘనంగా జరుగుతుంది. తర్వాత రోజు జాతర ముగుస్తుంది. జాతరకు భద్రాద్రి జిల్లా నుంచే కాక పొరుగు జిల్లాల నుంచీ భక్తులు భారీగా తరలి వస్తారు. దీనిలో భాగంగా సోమవారం ఉదయం నిర్వాహకులు, పూజారులు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, గోత్రనామార్చన, నిత్యపూజలు, ఉపనయనం, గౌరీపూజ, ఎదుర్కోలు ఉత్సవాలు చేపట్టనున్నారు. అనంతరం ఘనంగా కల్యాణ వేడుక నిర్వహించనున్నారు. తర్వాత మహానైవేద్యం సమర్పించనున్నారు.

ఆలయ నిర్మాణం ఇలా..

ఇల్లెందు మండలంలోని కొమరారానికి చెందిన కోరం కోటమ్మ అనే ఆదివాసీ భక్తురాలు ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించారు. ప్రస్తుతం ఆలయ నిర్వహణ బాధ్యతలను గ్రామస్తులు వెంకటలక్ష్మి, చాపల కృష్ణ నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి రోజు నాయకులగూడెం, కొమరారం గ్రామస్తులు రాధాకృష్ణుల కల్యాణ మహోత్సవానికి ముహూర్తాన్ని నిర్ణయిస్తారు. హోలీ పండుగ రోజు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ఆ తర్వాతి రోజు పూజలతో జాతర ముగుస్తుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ జాతరకు వేల సంఖ్యలో భక్తులు వస్తారని అంచనా. తలంబ్రాలు, బియ్యం సేకరణ, గ్రామ దేవతలకు బోనాల సమర్పణతో జాతర ప్రారంభమవుతుంది. ఆలయం ఎదుట 30 ఏళ్ల నుంచి ముస్లిం మహిళలు దుకాణాలు పెట్టి జీవనాధారం పొందుతున్నారు.

మంచి ఆదాయం వస్తున్నది

మాది ఇల్లెందు పట్టణం. రాధాకృష్ణుల కల్యాణం సందర్భంగా ఏటా నాయకులగూడెంలో రెండు రోజుల పాటు జాతర జరుగుతుంది. మా పూర్వీకుల నుంచి ఇక్కడ దుకాణాలు పెడుతున్నాం. దుకాణం నుంచి మంచి ఆదాయం వస్తున్నది.

– ఎస్కే పర్వీన్, దుకాణ యజమాని

నా కృష్ణుడి సేవకే జీవితం అంకితం

నా జీవితం కృష్ణుడి సేవకే అంకితం. నేను దశాబ్దాల నుంచి స్వామి సేవలో ఉన్నాను. పీటలపై కూర్చుని రాధాకృష్ణుల కల్యాణం జరిపించడం నా అదృష్టం. జాతరకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. హోలీ తర్వాతి రోజు పూజలతో జాతర ముగుస్తుంది.

– కిన్నెర నర్సయ్య, ఆలయ కమిటీ సభ్యుడు, నాయకులగూడెం

సంక్షిప్తం..

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

టేకులపల్లి, మార్చి 24 : సింగరేణికే తలమానికంగా నిలిచి అధిక లాభాలను అర్జిస్తున్న కేవోసీలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్ అన్నారు. ఆదివారం కోయగూడెం ఉపరితల గనిలో ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కార్మికులు ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఇన్‌చార్జ్ మేనేజర్ కేఎస్ఎన్ రాజుకు అందజేశారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

అశ్వారావుపేట, మార్చి 24 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జరిగే సమావేశం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

సమాజసేవలో రోటరీ క్లబ్ ఎప్పుడూ ముందుంటుంది

భద్రాచలం, మార్చి 24 : సమాజ సేవలో రోటరీ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని రోటరీ అధ్యక్షురాలు మహాలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక రూపా స్కూల్లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 10సైకిళ్లను బాలికలకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

టెట్ ఫీజును వెంటనే తగ్గించాలి

చండ్రుగొండ, మార్చి 24 : ప్రభుత్వం పెంచిన టెట్ ఫీజులను వెంటనే తగ్గించాలని గ్రామీణ నిరుద్యోగుల సంఘం బాధ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధ్యులు మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఇస్తున్న మెగా డీఎస్సీకి అర్హత పరీక్ష టెట్‌ను చూపి, ఫీజులు వసూలు చేస్తుందన్నారు. టెట్ ఫీజులు తగ్గించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు.

విజ్ఞాన్‌లో హోలీ సంబురాలు

పాల్వంచ, మార్చి 24 : హోలీ పండుగ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక విజ్ఞాన్ స్కూల్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రకరకాల రంగులతో ఉత్సాహంగా హోలీని జరుపుకున్నారు. రంగోలి ఆడారు.

మూగజీవిని కాపాడిన కొత్తగూడెం ఫైర్ సిబ్బంది

పాల్వంచ, మార్చి 24 : పాల్వంచ పట్టణంలోని రాంనగర్‌లో పాత బావిలో పడిపోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వీధి కుక్కను కాపాడాలని జంతు ప్రేమికురాలు మాయిని లక్ష్మీ ఇచ్చిన సమాచారంతో కొత్తగూడెం ఫైర్ సిబ్బంది చొరవ చూపారు. స్థానిక మహిళలతో కలిసి బావిలో అత్యంత దారుణ స్థితిలో ఉన్న కుక్కను బయటికి తీసి కాపాడారు.

ఎన్నికల నియమావళి పాటించాలి : డీఎస్పీ

ఇల్లెందు, మార్చి 24 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతిఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని డీఎస్పీ ఎన్.చంద్రబాను కోరారు. ఆదివారం స్థానిక ఐతా ఫంక్షన్‌హాల్‌లో రాజకీయ పార్టీల నాయకులతో పోలీసులు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సీఐ టి.కరుణాకర్, నాయకులు పాల్గొన్నారు.

'సీనియర్లకే అవకాశం కల్పించాలి'

మణుగూరుటౌన్, మార్చి 24 : కొత్త కొండాపురంలో కొత్తగా నిర్మించిన బొగ్గు లోడింగ్ చైన్ బంకర్ పనుల్లో సీనియర్లుగా ఉన్న సర్ఫేస్ జనరల్ మజ్దూర్లకే అవకాశం కల్పించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) మణుగూరు ఏరియా నాయకుడు నాగెళ్లి వెంకట్ అధికారులను కోరారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీనియార్టీ, నైపుణ్యత, అర్హతతో సంబంధం లేకుండా అవకాశం కల్పించడం సరికాదన్నారు.

మోడల్ పరీక్షకు అనూహ్య స్పందన

సారపాక, మార్చి 24 : సారపాకలోని బ్రిలియంట్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి ఎంసెట్ మోడల్ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. వివిధ కళాశాలల్లో చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు 63 మంది పరీక్షకు హాజరై ప్రతిభ చాటుకున్నారు. బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ బీఎన్ఆర్ మాట్లాడుతూ ఫలితాలు 28వ తేదీన తెలియజేస్తామని తెలిపారు.

వాహన తనిఖీలు

మణుగూరుటౌన్, మార్చి 24 : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పోలీసులు మణుగూరు పట్టణంలో ఆదివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని తెలంగాణ చౌరస్తా వద్ద మణుగూరు ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో వాహనాలను ఆపి సోదాలు చేశారు. సరైన ధ్రువపత్రాలు, లైసెన్సులు లేని వాహనాలకు, హెల్మెట్ ధరించని వారికి, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్న వారికి పరీక్షలు నిర్వహించి జరిమానాలు విధించారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన అవసరం

పాల్వంచ రూరల్, మార్చి 24: అటవీశాఖ అధికారులు, సిబ్బంది అటవీప్రాంతంతోపాటు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన ఉండాలని కిన్నెరసాని వైల్డ్ లైఫ్ ప్రాంత రేంజర్ శ్రీనివాసరావు అన్నారు. కిన్నెరసాని అభయారణ్యాన్ని సందర్శించేందుకు వచ్చిన దూలపల్లి (హైదరాబాద్) శిక్షణ కేంద్ర ఎఫ్‌డీవోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ ప్రాంత విస్తరణ అటవీశాఖ ప్రాథమిక విధి అని పేర్కొన్నారు. అనంతరం ఎఫ్‌డీవోలు డీర్ పార్క్, మందెరికలపాడు ప్లాంటేషన్‌ను సందర్శించారు. పర్యటనలో దూలపల్లి అకాడమీ డిప్యూటీ డైరక్టర్ రామ్మోహన్, వైల్డ్‌లైఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుడికి చేయూత

కొత్తగూడెం అర్బన్, మార్చి 24: పట్టణానికి చెందిన దివ్యాంగుడు కడలి సాయిబాబా కిరాణా వ్యాపారం చేసుకునేందుకు ఆదివారం చేతన ఫౌండేషన్ సభ్యులు రూ.15 వేలు విలువైన సామగ్రిని అందించారు.

బీమాతో ఆర్థిక భద్రత

అశ్వారావుపేట, మార్చి 24 : బీమా పాలసీల వల్ల కుటుంబాలకు ఆర్థిక భద్రత ఉంటుందని, ప్రతి కుటుంబం బీమా పాలసీలు తీసుకోవాలని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి తెలిపారు. మండలంలోని తోగ్గూడెం గ్రామానికి చెందిన కాకా సరోజని విద్యా పాలసీ తీసుకున్న 11 నెలల తర్వాత మృతి చెందింది. దీంతో బీమా కంపెనీ రూ.5,00,755 మంజూరు చేసింది. ఈ చెక్కును ఆదివారం ఎంపీపీ జల్లిపల్లి బీమా కంపెనీతో కలిసి మృతురాలి నామినీ కాకా ఉదయ్ కుమార్‌కు అందించారు.

ఘనంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు

అన్నపురెడ్డిపల్లి, మార్చి 24 : అన్నపురెడ్డిపల్లి బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయంలో చతుస్థానం, అగ్ని ప్రతిష్ఠ, నిత్యపూర్ణాహుతి, ధ్వజారోహణం, బలిహరిణం కార్యక్రమాలను నిర్వహించారు. యజ్ఞాచార్యులు గిరిధరాచార్యులు ఆధ్వర్యంలో పురోహితులు శ్రీస్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సంతానం లేనివారికి గరుడ ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గోటి తలంబ్రాలతో భద్రాద్రికి రామభక్తులు

దమ్మపేట, మార్చి 24 : శ్రీరామనవమి పర్వదినాన భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవానికి గోటి తలంబ్రాలను దమ్మపేటలోని సీతారామ భక్త కమిటీ సిద్ధం చేసిన తలంబ్రాలకు ఆదివారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ తలంబ్రాలను భద్రాచలంలోని సీతారాముల సన్నిదిలోని అప్పగించనున్నట్లు కమిటీ అధ్యక్షరాలు మురహరి సత్యవతి తెలిపారు. కార్యక్రమంలో అత్తులూరి కుమారి, గంగ, సీతారత్నం, సరస్వతి, విజయ పాల్గొన్నారు.

దమ్మపేట : గోటి తలంబ్రాలకు పూజలు చేస్తున్న భక్తులు

చర్ల, మార్చి 24 : శ్రీరామనవమి సందర్భంగా ఏప్రిల్ 17వ తేదీన జరిగే శ్రీ సీతారామ కల్యాణానికి గోటి తలంబ్రాలు అందజేసేందుకు చర్ల నుంచి భక్తులు ఆదివారం తరలివెళ్లారు. ఆదర్శదంపతులు సీతారామచంద్రుల కల్యాణానికి ఉడతాభక్తిగా తాము వడ్లు స్వయంగా ఒలిచి తీసుకువెళ్తున్నట్లు తెలిపారు.

చర్లలో..

జూలూరుపాడు, మార్చి 24: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ సన్నిధిలో జరుగనున్న శ్రీరామనవమి కల్యాణ మహోత్సవానికి జూలూరుపాడు, వెంగన్నపాలెం, పడమట నర్సాపురం, కాకర్ల, కొత్తూరు, జడల చింత, రాజారావుపేట గ్రామాలకు చెందిన రామభక్తులు కొద్దిరోజుల నుంచి గోటి తలంబ్రాలు ఒలుస్తున్నారు. రామభక్త మండలి సభ్యులు ఆదివారం వాటిని తీసుకుని పాదయాత్రగా భద్రాచలానికి బయల్దేరారు.

కొత్తగూడెం అర్బన్, మార్చి 24 : చుంచుపల్లి మండలం పెనుబల్లి పంచాయతీ అభయాంజనేయస్వామి ఆలయ ధర్మకర్త వేల్పుల మల్లేశ్ ఆధ్వర్యంలో భక్తులు తయారు చేసిన గోటి తలంబ్రాలతో భద్రాద్రి రామయ్య సన్నిధికి కాలినడకన బయల్దేరారు. ఆదివారం పెనుబల్లి గ్రామం నుంచి పాత కొత్తగూడెం మీదుగా ప్రధాన రహదారి నుంచి భద్రాచలం తరలి వెళ్లారు. గోటి తలంబ్రాలను ముడుపుగా కట్టుకొని తలపై వేసుకొని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి తరలి వెళ్లారు. పట్టణానికి చెందిన భక్తులు వారికి ఆహ్వానం పలికారు.

పర్ణశాల, మార్చి 24: శ్రీసీతారామచంద్ర స్వామివారి కల్యాణం సందర్భంగా చర్ల మండల రామ భక్తులు గోటితో వలిచిన తలంబ్రాలు, రామకోటి ప్రతులను తీసుకొని ఆదివారం ఉదయం పాదయాత్రగా బయలుదేరారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు రామభక్తులు దుమ్ముగూడెం మండలం చిన్నబండ్రేవు గ్రామంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయానికి చేరుకున్నారు. రామభక్తులకు చిన్నబండ్రేవు గ్రామానికి